RNI NO.TELTEL/2022/83842

PRABHAT A GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 304 | సంపుటి 4 | శుక్రవారం | 07-08-2026 | పేజీలు 4 | వెల 3/-

# డిఫాల్టర్ మిల్లర్లపై చర్యలేవి?




- నిద్రమత్తులో పౌరసరఫరాల శాఖ!
- గడువు ముగిసినా నత్తనడకన సీఎమ్మార్ ధాన్యం రికవరీ
- రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలులో తీవ్ర అలసత్వం
- ప్రభుత్వ సొమ్ముకు రక్షణ ఏది?
- మిల్లులపై కొరడా ఝుళిపించేదెప్పుడు...?

మానుకోట, ఆగస్టు 6 (ప్రభాత గమనం):

కోట్లాది రూపాయల విలువైన పేదల బియ్యం... మిల్లుల్లో మగ్గిపోతున్నా, కొందరు కస్టమ్ మిల్లింగ్ రైస్ మిల్లర్లు నిబంధనలను నడిరోడ్డుపై తూర్పారబడుతున్నా అధికారులు మాత్రం 'ఏమీ ఎరగనట్టు' వ్యవహరిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 18 మిల్లులు డిఫాల్ట్ మిల్లులుగా ఉండగా కేసముద్రంలో (5),మొగిలి చర్లలో (1), అనంతారంలో (1), అయ్యగారిపల్లిలో (1), అప్ప రాజు పల్లిలో (1), గూడూరు లో (1), కామారంలో (1), పొగుల్లపల్లిలో (1), కొత్తగూడలో (1), లడయ్ గడ్డలో (1), సాదిరెడ్డి పల్లిలో (1), పెద్దనాగారంలో (1), ఎల్లంపేటలో (1), దంతాల పల్లిలో (1) ఇలా డిఫాల్టర్ మిల్లులు ఉన్నాయి. కోట్లాది రూపాయల సిఎమ్ ఆర్ బకాయిలు పెండింగ్ లో ఉన్నప్పటికీ, డిఫాల్టర్ మిల్లర్లపై పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్ చేసి కార్పొరేషన్ కు అప్పగించాల్సిన మిల్లర్లు... గడువులు ముగిసి ఏళ్లు గడుస్తున్నా సరుకును అందజేయకుండా కాలయాపన చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా వివిధ రబీ, ఖరీఫ్ సీజన్లకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ నుండి ధాన్యం సేకరించిన రైస్ మిల్లర్లు, దానికి తగ్గట్టుగా బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. అయితే జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు రూ. 90 కోట్ల మేర సిఎమ్ ఆర్ బియ్యం బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి రావలసిన ఈ భారీ మొత్తంలో... అధికారులు రికవరీ చేసింది కేవలం రూ. 14 కోట్ల రూపాయలు మాత్రమే! ఇంకా సుమారు రూ. 76 కోట్లకు పైగా ప్రభుత్వ ధనం డిఫాల్టర్ మిల్లర్ల వద్దే మూలుగుతోంది. వసూళ్ల ప్రక్రియ నత్తనడకను మించిపోవడంతో అసలు ఈ సొమ్ము తిరిగి ప్రభుత్వ ఖజానాకు చేరుతుందా? లేదా మిల్లర్ల జేబుల్లోకి వెళ్లిపోతుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ నిబంధనల ప్రకారం గడువు ముగిసినా సిఎమ్ ఆర్ అప్పగించని మిల్లర్లపై రెవెన్యూ రికవరీ చట్టం కింద కేసులు నమోదు చేసి, వారి మిల్లులను జప్తు చేయడం లేదా వేలం వేసి ఆ మొత్తాన్ని రాబట్టాలి. కానీ జిల్లాలో ఈ ఆర్ఆర్ యాక్ట్ అమలు కేవలం కాగితాలకే పరిమితమైందనే ఆరోపణలు వస్తున్నాయి.గడువు ముగిసిన ప్రతీసారి అధికారులకు డిఫాల్టర్ మిల్లర్లకు నోటీసులు ఇవ్వడం, ఆ తర్వాత మిల్లర్లు ఏదో ఒక సాకు చెప్పి కాలయాపన చేయడం పరిపాటిగా మారింది.కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్లపై ఇప్పటివరకు కఠినమైన క్రిమినల్ కేసులు కానీ, మిల్లుల వేలం ప్రక్రియలు కానీ ఎందుకు వేగవంతం చేయడం లేదన్నది సమాధానం లేని ప్రశ్నగా మారింది.డిఫాల్టర్ మిల్లర్లపై చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద ఎత్తున రాజకీయ ఒత్తిళ్లు, నాయకుల సిఫార్సులు ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది. కొందరు బరితెగించిన మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు విక్రయించి, సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గడువులు దాటిపోతున్నా అధికారులు మౌనంగా ఉండటం వెనుక 'మామూళ్ల' పర్వం నడుస్తోందనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. "పేద ప్రజలకు అందాల్సిన సరుకును, ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్న డిఫాల్ట్ మిల్లర్ల మిల్లులను వెంటనే సీజ్ చేయాలి. ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగించి రాబట్టాల్సిన బకాయిలను తక్షణమే రికవరీ చేయాలి. అలసత్వం వహించే అధికారులపై కూడా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది."మరో పక్కా ధాన్యం మింగిన మిల్లర్ లపై సంబంధిత మంత్రి కఠిన చర్యలు ఉంటామని చెపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, డిఫాల్టర్ మిల్లర్ల జాబితాను బహిర్గతం చేసి, రూ. 90 కోట్ల బకాయిలను కఠినంగా రికవరీ చేయాలని జిల్లా ప్రజలు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.మరి ఆ దిశగా అడుగులు పడతాయా లేదా వేచి చూడాలి.

# 'గార్ల'లో బెల్ట్ జోరు





- గ్రామాల్లో యథేచ్ఛగా అక్రమ మద్యం విక్రయాలు
- సిండికేట్ల దోపిడీ.. రూ. 30 వరకు అదనపు బాదుడు
- మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ.. తూతూమంత్రంగా దాడులు
- చావు దెబ్బ తింటున్న పేద కుటుంబాలు, రోడ్డున పడుతున్న యువత
- గ్రామీణ ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్టు షాపులు

గార్ల,ఆగస్టు 6 (ప్రభాత గమనం):

పట్టణాలు, నిర్ణీత వ్యాపార సముదాయాలకే పరిమితం కావాల్సిన మద్యం దుకాణాలు నేడు పల్లెపల్లెనా, వీధి వీధినా పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. గార్ల మండలంలో అక్రమ మద్యం దందా హద్దు అదుపు లేకుండా సాగుతోంది. మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఒకటికి రెండు బెల్టు షాపులు నడుస్తుండటం ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతోంది. "పేపరు మీద బెల్టు షాపులు లేవు" అని అధికారులు ప్రకటనలు గుప్పిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం మద్యం ఏరులై పారుతోంది.ఎటువంటి చట్టబద్ధమైన అనుమతులు లేవు, నిబంధనలు అసలే లేవు! తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు ఈ బెల్టు షాపులు నిరంతరం తెరిచే ఉంచుతున్నారు.రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడే దిగువ మధ్యతరగతి, నిరుపేద కూలీలను టార్గెట్ చేస్తూ ఈ దందా సాగుతోంది. పనులకు వెళ్లేముందు నుంచి మొదలుకొని, రాత్రి ఇళ్లకు చేరేవరకు మద్యం అందుబాటులో ఉంచుతున్నారు.ఇంతటితో ఆగకుండా, ఎమ్మార్పీ ధరల కంటే సీసాకు కనీసం రూ. 30 వరకు అదనంగా వసూలు చేస్తూ మద్యం సిండికేట్లు నాటు దోపిడీకి తెరలేపాయి. గార్ల, వైన్స్ షాపుల నుంచి యథేచ్ఛగా మద్యాన్ని కొనుగోలు చేసి గ్రామాల్లోని హోటళ్లు, కిరాణా షాపులు, రహదారుల పక్కన ఉన్న తాత్కాలిక డబ్బాల్లో విక్రయిస్తున్నారు.నిబంధనల ప్రకారం ప్రధాన రహదారులు, జాతీయ రహదారుల పక్కన మద్యం విక్రయాలు నిర్వహించకూడదు. కానీ గార్ల మండలంలో మాత్రం ప్రధాన రోడ్ల పక్కనే దర్జాగా మద్యం విక్రయిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎక్సైజ్ శాఖ అధికారులు అప్పుడప్పుడు నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లతో చేతులు కలిపి, మా మూళ్ల మత్తులో జోగుతూ ఎక్సైజ్ అధికారులు అక్రమాలను కప్పిపుచ్చుతున్నారని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. బెల్టు షాపుల విజృంభణ వల్ల పల్లెల్లో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి. మద్యానికి బానిసైన పలువురు నిరుపేదలు అనారోగ్యం పాలవు తుంటే, మరికొందరు అప్పుల ఊబిలో కూరుకుపోయి వీధిన పడుతు న్నారు. మత్తులో కుటుంబ సభ్యులతో గొడవలు పడటం, గ్రామీణ ప్రాంతాల్లో తరచూ ఘర్షణలకు దిగడం నిత్యకృత్యంగా మారింది. ముఖ్యంగా యువత బెల్టు షాపు ల సంస్కృతికి బానిసగా మారి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటోంది. కొత్త ఎక్సైజ్ పాలసీ వచ్చి ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయాలు జరగాలని, కల్తీ మద్యాన్ని అరికట్టాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో అవి అమలుకు నోచుకోవడం లేదు. గార్ల మండలంలో యథేచ్ఛగా సాగుతున్న ఈ అక్రమ 'బెల్టు దందా'పై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని, బెల్టు షాపులను శాశ్వతంగా మూసివేసి పల్లెల్లో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.





## గద్దర్, జయశంకర్‌లకు
# సీఎం నివాళులు

- ప్రజాకవి గద్దర్ సేవలను స్మరించిన ముఖ్యమంత్రి
- జయశంకర్ ఆశయాల సాధనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్న రేవంత్

హైదరాబాద్, ప్రజాతంత్ర, ఆగస్టు 6 :

ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూలమాలులు వేసి నివాళులర్పించారు. గద్దర్ ఆట–పాట తెలం గాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తన పాటల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నింపారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం తన గళాన్ని వినిపించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ ఉద్యమం లో గద్దర్ పాటలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయన్నారు. పాటను ప్రజా ఉద్యమానికి ఆయుధంగా మార్చిన అరుదైన వ్యక్తిత్వం గద్దర్‌ది అని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. అలాగే తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొ. జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి సీఎం పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర అత్యంత కీలకమైనదని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయా ల సాధనకు ప్రజా ప్రభు త్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

## ఉమెన్ సేఫ్టీ వింగ్ కస్టడీలో ఉదయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్,ప్రభాతగమనం,ఆగస్ట్6: ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని ఉమెన్ సేఫ్టీ వింగ్ అధికారులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఐదున్నర గంటల వరకు కస్టడీ కొనసాగనుంది. అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీసీపీ .. అత్తాపూర్ పీఎస్‌కు చేరుకున్నారు. కృష్ణారెడ్డిని డీసీపీ పర్యవేక్షణలో సీఐ జ్యోత్స్న విచారిస్తున్నారు. కస్టడీలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. విచారణలో కీలక ఆధారాలు సేకరించే దిశగా పోలీసులు దృష్టి సారించారు. ప్రధానంగా మిస్సైన మొబైల్ ఫోన్‌పై పోలీసులు ఫోకస్ పెట్టారు. ఉదయ్ కృష్ణారెడ్డి రెండో మొబైల్ పైన ఆరా తీస్తున్నారు.

P-02_Layout 2 07-Aug-26 12:51 AM Page 1









# జయశంకర్ సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి

- తెలంగాణ సిద్ధాంతకర్తకు ఘన నివాళులు
- రాష్ట్రవ్యాప్తంగా సార్ జయంతి వేడుకలు
- సార్ ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపు
- పలువురు ప్రజాప్రతినిధులు, మేధావుల నివాళులు
- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తికి ప్రతీక జయశంకర్
- తెలంగాణ స్వప్న సాకారానికి మార్గదర్శి జయశంకర్
- సార్ సేవలను స్మరించుకున్న నాయకులు

గార్ల, ఆగస్టు 6 (ప్రభాత గమనం):

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాంతం పోరాడిన సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని తొలితరం తెలంగాణ ఉద్యమకారుడు, బిఆర్ఎస్ నాయకుడు అనంత రాములు పిలుపునిచ్చారు.

గురువారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ సమీపంలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అనంత రాములు మాట్లాడుతూ... సమైక్య రాష్ట్ర పాలనలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్షను, అన్యాయాన్ని ఎండగడుతూ ప్రజల్లో ఉద్యమ చైతన్యాన్ని రగిల్చిన మహనీ యుడు జయశంకర్ అని కొనియాడారు. ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నెరవేరే వరకు తుది శ్వాస వరకు శ్రమించిన మహా యోధుడు, తెలంగాణ జాతిపిత అని గుర్తుచేశారు. జయశంకర్ సార్ చూపిన బాటలోనే పయనిస్తూ, ఆయన కన్న కలలను నిజం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్రబోయిన భిక్షమయ్య, ఎండి ఖదీర్ బాబా, వెంకట్, బండారి దేవేందర్, ముంగి రాములు, వేణు, సంగిశెట్టి ప్రభాకర్, చంద్రశేఖర్, పానుగంటి రాధాకృష్ణతో పాటు పలువురు తెలంగాణ ఉద్యమకారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## పెనుగొండలో ఘన నివాళులు..

కేసముద్రం ఆగస్టు 6(ప్రభాత గమనం):

తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం పెనుగొండ గ్రామంలో ఘనంగా నివాళులర్పిం చారు. గ్రామ సర్పంచ్ కంకల లక్ష్మి కొమురయ్య ప్రొ. జయశంకర్ చిత్రప టానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రజలకు చాటి చెప్పడంలో ప్రొ. జయశంకర్ పాత్ర అపారమని అన్నారు. రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగం, కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు ప్రొ. జయశంకర్ గారి సేవలను ఎన్నటికీ మరవలేరని తెలిపారు.

## జయశంకర్ సార్ కు కేటీఆర్ నివాళి

హైదరాబాద్ ఆగస్టు 6(ప్రభాత గమనం):

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లోని ఆయన విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్షనేత మధుసూధనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతా, గండ్ర వెంక టరమణ, బానోత్ శంకర్ నాయక్, కోరుకంటి చందర్, మెతుకు ఆనంద్, బిగాల గణేష్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ తుల ఉమా, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మా రెడ్డి, మాజీ కార్పొ రేషన్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

## నివాళులర్పించిన కలెక్టర్ స్నేహ శబరిష్

మహబూబాబాద్ ఆగస్టు 6(ప్రభాత గమనం):

ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను భావితరాలకు చాటాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ పిలుపునిచ్చారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకల్లో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని, జయశంకర్ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిని నాగలక్ష్మి, జిల్లా అధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, విజయ్ చంద్ర, శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ రెడ్డి, మరియన్నా, జ్యోతి, విజయ నిర్మల, విజయ, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, కలెక్టరేట్ మరియు బిసి సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ మహనీయులకు ఘనంగా నివాళులు

కేసముద్రం ఆగస్టు 6(ప్రభాత గమనం):

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ మరియు తెలంగాణ యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్ జయంతి వేడుకలను శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మహనీయుల చిత్రపటా లకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశం కర్ జీవితాంతం పోరాడారని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యా ప్తంగా వినిపించిన మహోన్నత వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని బలంగా చాటిచెప్పిన గొప్ప మేధావి అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు బలమైన పునాదులుగా నిలిచాయని వివరించారు. అలాగే ప్రజాకవి గద్దర్ తన పాటలతో, సాహిత్యంతో సామాన్య ప్రజల్లో చైతన్యం నింపారని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ప్రజా కళాకారుడిగా గద్దర్ చిరస్థాయిగా గుర్తుండిపోతారని తెలిపారు. ఆయన పాటలు తెలంగాణ ఉద్యమానికి ఉత్సాహాన్ని నింపి, ప్రజల్లో ఆత్మగౌరవ భావనను పెంపొందించారని చెప్పారు.



## జూరాల ప్రాజెక్టుకు
# కొనసాగుతున్న భారీ వరద

గద్వాల ఆగస్టు 6(ప్రభాత గమనం):

జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరద కొనసాగుతోంది. వరద ఉధృతి పెరగడంతో ప్రాజెక్టు అధికారులు గురువారం ఉదయం 29 గేట్లను ఎత్తి కృష్ణానదిలో భారీగా నీటిని విడుదల చేస్తున్నారు.ప్రస్తుతం ప్రాజెక్టులోకి 2,42,645 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ఇందులో అధిక భాగం నీటిని 29 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే జూరాల జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుండగా, సాగునీటి కాలువలు, లిఫ్ట్ పథకాల ద్వారా కూడా అవసరమైన మేరకు నీటిని వదులుతున్నారు. మొత్తం 2,40,319 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల అవుతోంది.జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, ప్రస్తుతం 317.48 మీటర్ల నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 7.608 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అంటే ప్రాజెక్టు దాదాపు నిండే స్థితికి చేరుకుంది. భారీగా నీటిని విడుదల చేస్తున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చ రించారు. నదిలోకి చేపల వేటకు వెళ్లరాదని, నది ఒడ్డున అనవసరంగా సంచరించవ ద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నందున జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# 15 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ

- సీఎం రేవంత్ చేతుల మీదుగా సంగారెడ్డిలో ప్రారంభం
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, ప్రభాతగమనం, ఆగస్టు 6:

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే ల క్ష్యంతో ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యా ప్తంగా 1.05 కోట్ల కొత్తగా మంజూరైన లామి నేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ రేషన్ కార్డులను స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు నీటిపారుదల, ఆహా ర, పౌరసర ఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక మెమో జారీ చేశా రు. రేషన్ కార్డుల పంపిణీని ప్రభుత్వం అ త్యంత ప్రతి ష్ఠాత్మకంగా చేపడుతోందని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తు న్నామని చెప్పారు. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రారంభోత్సవం నిర్వహించ నుండగా అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామ న్నారు. ప్రతి నియోజకవర్గంలో ఆర్‌డీఓ సమ న్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదే శించారు. స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 15న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టా లని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. లబ్ధిదా రుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారు లను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పాలనలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

## సామాజిక న్యాయం కోసం
# నాజీవితం అంకితం

- జీవితాలను మార్చే సామాజిక న్యాయ సంకల్ప సభ
- నా పుట్టుక నాచేతిలో లేదు
- ఎవరికోసం పనిచేయాలో నిర్ణయించుకునేది నేనే
- అగ్రకుల ప్రజాస్వామ్య వాదులే మార్పులకు కారణం
- బీసీలకు 50శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతా
- టీఆర్ ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, ప్రభాతగమనం :



ఒకనాటి అమానవీయ పరిస్థితు లను మార్చుకునేందుకే మనం రాజ్యాంగం రాసుకున్నాం. కానీ రాజ్యాంగం పూర్తి స్థాయిలో మనం అమలు చేసుకోలేకపోయాం. అందుకే మనం ఈ సభ ద్వారా సామాజిక న్యాయ పోరాటం చేయబోతున్నాం. సామాజిక న్యాయ సంకల్పం తీసుకో బోతున్నామని టీఆర్ ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో మాట్లాడుతూ సామాజిక న్యాయం అనగానే అగ్రవర్ణాలు మా సీట్లు ఎక్కడ పోతాయోనని భయపడు తారు. ఇవ్వాళ మనం టీఆర్ఎస్ అనే పార్టీ పెట్టుకున్నాం. మనకు సామాజిక న్యాయంపై పోరాటం చేసే ఒక గొప్ప అవకాశం దొరికింది. సమాజంలోని అగ్రవర్ణాల్లో ఉన్న గొప్ప నాయకులే ఒక్కొక్కరుగా వెలుగుతూ మనం ప్రజా స్వామ్యాన్ని సాధించుకునే పరిస్థితి తెచ్చారు. నేను బీసీల గురించి మాట్లాడితే చాలా మంది అగ్రవ ర్ణాల్లో పుట్టిన నీకెందుకు అంటూ పళ్లు ఇకిలిస్తారు. కానీ నా పుట్టుక నా చేతిలో లేదు. కానీ నేను ఎవరి కోసం పనిచేయాలో అది నా చేతిలోనే ఉంది. ఇప్పటి వరకు గ్రామపంచాయితీ మొఖం కూడా తెలియని కులాలతో పనిచేసి వారిలో సాధికారిత తెచ్చే వరకు కూడా నా జీవితాన్ని అంకితం చేస్తున్నా. ఈ దేశంలో ఇప్పటి వరకు వచ్చిన విప్లవాత్మక మార్పుల్లో చాలా వరకు కూడా అగ్రకు లాల్లో ఉన్నప్రజాస్వామ్య వాదుల ప్రయత్నం ద్వారానే జరిగాయి. మండలి కమిషన్ రిపోర్ట్ ను కాంగ్రెస్ పార్టీ 20 ఏళ్లు బీరువాలో పెడితే...విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ అనే క్షత్రియ పుత్రుడే దాన్ని అమలు చేశారు. తమిళనాడు లో బీసీలకు రిజర్వేషన్ల కోసం వాటిని 9 వ షెడ్యూల్ లో పెట్టించినది అగ్రకులానికి చెందిన జయలలిత గారే. అలాంటి వారందరినీ మనం ఆదర్శంగా తీసుకొని ముందుకు కదలాలి. మనవాళ్లపై మనమే వివక్ష చూపటం మాత్రం అన్యాయం. రిజర్వేషన్లు ఉన్న ప్పటికీ కూడా 97 శాతం దళితులు అత్యంత వెనుకబాటులో ఉన్నారు. సామాజిక న్యాయం కోసం మనం చేసే పోరాటాన్ని వచ్చే ఏడాది ఆగస్ట్ 6 నాటికి సమీక్ష చేసుకుందాం. తెలంగాణ ఉద్యమంతో పాటు సామాజిక తెలంగాణ ఉద్యమాన్ని ఒకేసారి చేయలేమని అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత సామాజిక న్యాయం కోసం అంతే పవిత్రంగా మనం ఉద్యమాన్ని చేయాలని చెప్పారు. జయ శంకర్ సార్ కన్న కలలను నిజం చేసే విధంగా మనం పోరాటం చేద్దాం. జయశంకర్ సార్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ వద్ద పెట్టాలని అన్నారు.

## 'సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం'
# వేగవంతం చేయాలి

- జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి

కేసముద్రం ఆగస్టు 6(ప్రభాత గమనం):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం సప్లై కేంద్రం పనులు వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు గురువారం కేసముద్రం కేంద్రంగా హరికృష్ణ మూమెంట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో సప్లై చేసే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం కేంద్ర ప్రాంతమైన కేసముద్రం మార్కెట్ యార్డ్ గోదాంను ఖాళీ చేయించే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం ఖాళీ చేసే సంధాని కంపెనీ వారితో డిఇఓ మాట్లాడారు. ఇప్పటివరకు 30% మాత్రమే గోదాం ఖాళీ చేశారని మిగతా 70% గోదాం ఖాళీ చేసే పనులను వేగవంతం చేయాలన్నారు. మరిన్ని లారీలను ఏర్పాటు చేసి త్వరగా ఖాళీ చేస్తే సీఎం బ్రేక్ పథకం అత్యంత త్వరలో ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్య క్రమంలో డిఈఓ తో పాటు జిఈసిఓ వై. గాయత్రి పాల్గొన్నారు.





# ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- **ఫార్మసీ, నర్సింగ్ ఆఫీసర్లకు డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ. అప్పయ్య సూచనలు**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), పట్టణ ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీలు)లో పనిచేస్తున్న ఫార్మసీ ఆఫీసర్లు, నర్సింగ్ ఆఫీసర్లు రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ ఎ. అప్పయ్య సూచించారు. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఫార్మసీ ఆఫీసర్లు, నర్సింగ్ ఆఫీసర్లతో ఆయన వేర్వేరుగా నిర్వహించిన సమీక్ష సమావేశాల్లో మాట్లాడారు. ఫార్మసీ ఆఫీసర్లు ఈ–ఔషధి పోర్టల్‌లో మందుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని, ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని ఔషధాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఉప ఆరోగ్య కేంద్రాలకు సకాలంలో మందులు సరఫరా చేయడంతో పాటు, రోగులకు మందుల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాక్సిన్లను నిర్దేశిత ఉష్ణోగ్రతలో భద్రపరచడంతో పాటు, ఈ–విన్ పోర్టల్‌లో వ్యాక్సిన్ నిల్వలు, పంపిణీ వివరాలను నమోదు చేయాలని, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నారు. నర్సింగ్ ఆఫీసర్లు ఆసుపత్రులకు వచ్చే రోగులతో పాటు గర్భిణీ స్త్రీలకు అవసరమైన కౌన్సెలింగ్ అందించాలని, ఈ–ఆరోగ్యం పోర్టల్‌లో అన్ని వివరాలను నమోదు చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇచ్చి అవసరమైతే మాత్రమే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని తెలిపారు. ఫార్మసీ ఆఫీసర్ అందుబాటులో లేని సమయంలో వ్యాక్సిన్ల భద్రత, పంపిణీ బాధ్యతలను నర్సింగ్ ఆఫీసర్లు నిర్వహించాలని, ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను పూర్తిచేసి అన్ని కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశాల్లో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి. మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, మాతా శిశు సంక్షేమ కార్యక్రమ అధికారి డాక్టర్ రజిత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రీకృష్ణారావు, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ మురళి, డెమో అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వినూత్న పంటల సాగుకు రైతులను చైతన్యవంతం చేయాలి

- **నల్లు సుధాకర్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి**

సిరోల్ ఆగస్టు 6(ప్రభాత గమనం):

వ్యవసాయ రంగంలో వైవిధ్యంతో కూడిన పంటల సాగు వైపుకు రైతులను చైతన్య వంతం చేయాలని ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిరోలు మండలం కాంపల్లి రైతు వేదికలో జరిగిన ఫెర్టిలైజర్స్, ఫెస్ట్ సైడ్స్ యజమానుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుధాకర్ రెడ్డి మాట్లాడారు.. ప్రభుత్వం నిషేధించిన మందులను ఎట్టి పరిస్థితులలో అమ్మకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన తరుణంలో రైతులు నష్టపోకుండా కూరగాయలు, నూనె గింజల పప్పు ధాన్యపు పంటల సాగుకు రైతులను ప్రోత్సహించే విధంగా, ప్రభుత్వం సూచించిన ఏడు రకాల వరి సన్నాలని వేసే విధంగా చూడాలని తెలిపారు. నానో డీఏపీ, నానో యూరియా వాడకంపై ప్రచారం చేయాలని షాప్ యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని ఛాయారాజ్,ఏఈఓ భరత్, వ్యాపారులు సుస్మన్ రెడ్డి బద్రు, వీరన్న, దేవేందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# యువతే పార్టీకి వెన్నెముక..

- **గ్రామ స్థాయి నుంచి పోరాట స్ఫూర్తిని పెంచాలి**
- **పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

హైదరాబాద్ ఆగస్టు 6(ప్రభాత గమనం):

తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ యువజన విభాగంతో టీఆర్పీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాష్ట్ర,జిల్లా నాయకులతో పార్టీ విస్తరణ, యువత పాత్ర, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ, యువతే సమాజ మార్పుకు అసలైన శక్తి అని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలను ప్రతి గ్రామం, ప్రతి ఊరు, ప్రతి కళాశాలకు తీసుకెళ్లే బాధ్యత యువజన విభాగంపైనే ఉందన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, యువతలో రాజకీయ చైతన్యాన్ని పెంచాలని సూచించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని, ప్రతి మండలం, ప్రతి గ్రామంలో యువజన కమిటీలను బలోపేతం చేయాలని ఆదేశించారు. సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగిస్తూ పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువతను పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా విద్య, ఉద్యోగాలు, బీసీల రాజ్యాధికారం, సామాజిక న్యాయం వంటి ప్రజా సమస్యలపై యువజన విభాగం ముందుండి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. పార్టీ కార్యక్రమాల్లో క్రమశిక్షణ, అంకితభావం, ప్రజలతో నిరంతర అనుబంధమే విజయానికి పునాది అని మల్లన్న స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేయడంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని మల్లన్న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గంగాధర్ లింగాల,ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్,క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్, స్టేట్ ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్ రాష్ట్ర,జిల్లా యువజన విభాగం నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






# ఏటీఎం కార్డుల మార్పిడి ముఠా అరెస్టు

- **రూ.1.10 లక్షల నగదు, 18 ఏటీఎం కార్డుల స్వాధీనం**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

హనుమకొండ ఏటీఎం కేంద్రాల్లో అమాయక ప్రజలను మోసం చేసి వారి ఏటీఎం కార్డులను మార్చి, పిన్ నంబర్లు తెలుసుకుని వివిధ ఏటీఎంల నుంచి నగదు డ్రా చేస్తున్న ఇద్దరు నిందితులను హనుమకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. అరెస్టు అయిన నిందితులు మేడ్చల్ జిల్లాలోని చర్చి గోగిలాపూర్‌కు చెందిన గోపు సాత్విక్ (24), కొమ్మారెడ్డి బాల కార్తీక్ (24)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో నిందితులు హనుమకొండ, నర్సంపేట, వర్ధన్నపేట, సూరారం ప్రాంతాల్లో ఏటీఎం కార్డులు మార్చి బాధితుల ఖాతాల నుంచి నగదు అక్రమంగా డ్రా చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.1,10,000 నగదు, 18 ఏటీఎం కార్డులు, రెండు స్మార్ట్ మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గోపు సాత్విక్‌పై గతంలో దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో 11, జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో 2 కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. మొత్తం 13 ఏటీఎం కార్డు మార్పిడి, నగదు చోరీ కేసుల్లో అతనిపై అభియోగాలు ఉన్నాయని తెలిపారు. అలాగే గోపు సాత్విక్, బాల కార్తీక్‌లపై సూరారం పోలీస్ స్టేషన్‌లో మరో కేసు కూడా నమోదైందని, ఆ కేసుల్లో అరెస్టై జైలుకు వెళ్లి అనంతరం బెయిల్‌పై విడుదలైనట్లు విచారణలో తేలిందన్నారు. ప్రస్తుతం ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో సంయుక్తంగా పనిచేసిన సీసీఎస్, హనుమకొండ పోలీసు బృందాన్ని అధికారులు అభినందించారు. ముఖ్యంగా సీసీఎస్ వరంగల్ ఎస్సై చందర్ మధు, నర్సింగరావు, చందు, హనుమకొండ సిబ్బంది రమణ, రావుఫ్, మహిపాల్, అశోక్, ఐటీ కోర్‌కు చెందిన సల్మాన్ సేవలను అధికారులు ప్రశంసించారు.

# ఆగస్టు 15 ఇక ఇండియా డే

అమెరికా ఆగస్టు 6(ప్రభాత గమనం):




భారత స్వాతంత్ర్య దినోత్సవానికి అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రంలో అరుదైన గుర్తింపు లభించింది. ప్రతిఏటా ఆగస్టు 15వ తేదీని అధికారికంగా 'ఇండియా డే'గా ప్రకటిస్తూ ఆ రాష్ట్ర గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికాలో ప్రవాస భారతీయుల సాంస్కృతిక, ఆర్థిక అలాగే పౌర సేవా రంగాల అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రకటనతో స్థానిక భారతీయ సంతతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 28 కిలోల గంజాయి స్వాధీనం

- **ఇద్దరు అరెస్ట్.. ఒకరు పరారీ**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



ఒడిశా రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 28 కిలోల ఎండు గంజాయిని నర్సంపేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా, మరో వ్యక్తి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 5న మధ్యాహ్నం సమయంలో ఒడిశా రాష్ట్రం నుంచి భద్రాచలం–మహబూబాబాద్–నర్సంపేట మీదుగా బొలెరో వాహనంలో గంజాయిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. వెంటనే ఎస్సై అరుణ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మహబూబాబాద్ బైపాస్ రోడ్డుపై వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న బొలెరో వాహనాన్ని అడ్డుకొని తనిఖీ చేయగా, అందులో ఉన్న ముగ్గురిలో ఒకరు పరారయ్యారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా, వాహనం కింది భాగంలో ప్రత్యేకంగా తయారు చేసిన రహస్య బాక్సుల్లో గంజాయిని దాచిపెట్టి రవాణా చేస్తున్నట్లు వెల్లడైంది. తహసీల్దార్ సమక్షంలో ఆ బాక్సులను తెరిచి పరిశీలించగా, రూ.14 లక్షల విలువైన 28 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. అలాగే రెండు సెల్‌ఫోన్లు, బొలెరో వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లాకు చెందిన అమృత బైద్యాయ్, పుజూర్ రాయ్‌లుగా గుర్తించారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని స్వాధీనం చేసుకున్న నర్సంపేట పోలీసు బృందాన్ని నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి అభినందించారు. అరెస్టు చేసిన నిందితులను గురువారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# వైరల్ హెపటైటిస్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- **జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ డా. సత్య శారద**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

జాతీయ వైరల్ హెపటైటిస్ నియంత్రణ కార్యక్రమం (ఎన్.వి.హెచ్.సీ.పి) అమలులో భాగంగా వరంగల్ కలెక్టర్ డా. సత్య శారద అధ్యక్షతన జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హై–రిస్క్ గ్రూపులకు హెపటైటిస్–బి వ్యాక్సినేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెపటైటిస్–ఎ, హెపటైటిస్–ఈ వ్యాప్తిని అరికట్టేందుకు తాగునీటి వనరుల క్లోరినేషన్‌ను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. హెపటైటిస్ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని, రక్తదాతలకు తప్పనిసరిగా హెపటైటిస్ స్క్రీనింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. హై–రిస్క్ గ్రూపులతో పాటు సాధారణ ప్రజల్లోనూ హెపటైటిస్ వ్యాధిపై విస్తృత అవగాహ న కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.




జిల్లా వ్యాప్తంగా వైరల్ హెపటైటిస్ నియంత్రణ కు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ స మావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజా రెడ్డి, నర్సంపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. దామోదరి, జిల్లా వైరల్ హెపటైటిస్ నోడల్ అధికారి డా. ఉష, డీసీహెచ్ఎస్ వర్ధన్నపేట డా. రాంమూర్తి, డిప్యూటీ డీఎంహెచ్ఓ వర్ధన్నపేట డా. రాజమౌళి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, బ్లడ్ బ్యాంక్ వైద్య అధికారి డా. సంయుక్త, సభ్యులు స్వప్న మాధురి, లైలా, చందు, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఆదివాసీ రాజ్యాధికార హక్కుల కోసం ఉద్యమిద్దాం..

- **ఆదివాసీల భూములు, అటవీ హక్కులపై దాడులు ఆపకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు తప్పదు**
- **షెడ్యూల్-5 ప్రాంతాల్లో కార్పొరేట్ మైనింగ్‌కు వ్యతిరేకంగా ఆదివాసీ ఐక్య పోరాటానికి పిలుపు**
- **పెద్ద చంద్రన్న వర్గానికి గట్టి ఎదురుదెబ్బ**
- **ప్రజా సమస్యలపై పోరాటమే నిజమైన రాజకీయమంటున్న అశోకన్నా**
- **నాయకత్వంపై విశ్వాసం ప్రకటించిన నాయకులు**
- **జల్-జంగిల్-జమీన్ హక్కుల సాధనే లక్ష్యం..**
- **ఆగస్టు 9ను ప్రతి గ్రామంలో పోరాట దినంగా నిర్వహించాలని పిలుపు**
- **పెద్ద చంద్రన్న పార్టీకి ముకుమ్మడి రాజీనామాలు**
- **అశోకన్నా వర్గంలో చేరికలు**



మహబూబాబాద్ ఆగస్టు 6(ప్రభాత గమనం):

ఆదివాసీ స్వయం పాలన, రాజ్యాధికార హక్కుల సాధన కోసం గ్రామ గ్రామాన పోరాటాలను ఉధృతం చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా పిలుపునిచ్చారు. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి పోరాట దినంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలనే పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం గురువారం సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి సనప పోమ్మయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా ఆదివాసీల హక్కులపై సుదీర్ఘంగా ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు తరతరాలుగా తమ భూమి, అటవీ, సహజ వనరులు మరియు స్వయం పాలన హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదివాసీల రక్తత్యాగాలు, నిరంతర ఉద్యమాల ఫలితంగానే 1/70 భూబదిలీ నియంత్రణ చట్టం, పెసా చట్టం, అటవీ హక్కుల చట్టం వంటి కీలక చట్టాలు వచ్చాయని గుర్తు చేశారు. అయితే ఈ చట్టాలను ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానాలను విరమించుకొని ఆదివాసీల జీవన హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో నంబర్–3 అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జల్–జంగిల్–జమీన్ హక్కుల పరిరక్షణ కోసం ఆదివాసీ యువత, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**- పెద్ద చంద్రన్న పార్టీకి షాక్....**

ఈ సభ అనంతరం పాకాల రాజకీయాల్లో సంచలనం రేపిన పరిణామం చోటుచేసుకుంది. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పెద్ద చంద్రన్న పార్టీకి చెందిన సీనియర్ నాయకులు సిద్దబోయిన జీవన్, శ్రీరాములు నాయకత్వంలో 15 కుటుంబాలు ముకుమ్మడిగా రాజీనామా చేసి సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అశోకన్నా పార్టీలో చేరారు. రాజీనామా చేసిన నాయకులు మాట్లాడుతూ పెద్ద చంద్రన్న పార్టీ ప్రతిఘటన పోరాటాల పేరుతో కార్యకర్తలను మభ్యపెడుతోందని ఆరోపించారు. ప్రజా సమస్యలపై ఆచరణాత్మక పోరాటాలు చేయకుండా కేవలం నినాదాలకే పరిమితమైందని విమర్శించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని నాయకత్వంతో కొనసాగడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

**- అశోకన్నా నాయకత్వంపై విశ్వాసంతో చేరికలు....**

సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ అశోకన్నా వర్గం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందని, గోదావరి లోయ ప్రాంతంలో ప్రతిఘటన పోరాట రాజకీయాలను బలోపేతం చేస్తోందని భావించి పార్టీలో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు సిద్ధబోయిన జీవన్, శ్రీరాములు తో సహా సుమారు 15 కుటుంబాలకు చెందిన కార్యకర్తలు, నాయకులు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ అశోకన్నా పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ అశోకన్నా పార్టీ కండువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు.

**- ఆదివాసీ హక్కుల కోసం పోరాటాలు మరింత ఉధృతం చేస్తాం...**

రాష్ట్రంలో ఆదివాసీ భూములు, అటవీ హక్కులు, స్వయం పాలన పరిరక్షణ కోసం రాబోయే రోజుల్లో మరింత ఉధృతంగా ఉద్యమాలు నిర్వహిస్తామని పార్టీ నాయకత్వం హెచ్చరించింది. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి పోరాట దినంగా ప్రతి గ్రామంలో నిర్వహించి ఆదివాసీ ప్రజల సమస్యలను దేశవ్యాప్తంగా చర్చనీయాంశం చేస్తామని ప్రకటించింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి బానోత్ ఉక్లా, పార్టీ జిల్లా నాయకులు ఆరెం కోటమ్మ, పి డి ఎస్ యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, ఇరుగు నాగన్న, పి ఓ డబ్ల్యు నాయకురాలు గోనే భాగ్యలక్ష్మి, పి వై ఎల్ నాయకులు గణేష్ ,భూక్యా శివ, నాయకులు మంగన్న, శీను, అనురాధ, అరుణోదయ రాష్ట్ర నాయకులు బుజ్జయ్య , నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటల కరెంట్‌కు మంగళం

- **మాజీ మంత్రి హరీష్ రావు**

సిద్ధిపేట ఆగస్టు 6(ప్రభాత గమనం):

రైతులకు 24 గంటల ఉచిత కరెంటుకు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడిందని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే హరీష్ రావు ఆకస్మికంగా సందర్శించి, లాక్ బుక్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వం చాలా చిన్నచూపు చూస్తుంది అన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 12 గంటలు అందిస్తున్నారన్నారు. బుధవారం రోజు 10 గంటల 30 నిమిషాలు మాత్రమే కరెంటు సరుఫరా చేసినట్లు లాక్ బుక్ లో ఉందన్నారు. ఒక వైపు కాళేశ్వరంతో రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ నింపక రైతులకు నీళ్లు అందడం లేదన్నారు. మరో వైపు చూస్తే కరెంటు కూడా సరిగ్గా ఇవ్వక పంటలకు నీళ్లు అందని పరిస్థితి నెలకొందన్నారు.

**- తక్షణమే సమీక్ష నిర్వహించాలి..**

రైతులకు 3 గంటల కరెంటు చాలు.. 24 గంటల కరెంటు ఎందుకు..అని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి చెప్పారు ఇప్పుడు చెప్పిన మాటలను నిజం చేసి చూపిస్తున్నారని మండిపడ్డారు. సీఎం



రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులపై కక్ష పెట్టుకొని కరెంటును సరిగ్గా సరఫరా చేయడం లేదన్నారు. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో రూ.4,900 డీడీ కడితే ఉచిత విద్యుత్ కనెక్షన్ వచ్చేదన్నారు. ఇప్పుడు ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచారు. అయినా కనెక్షన్లు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే సమీక్ష నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను వెంటనే విడుదల చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బట్ట కాల్చి మీదెస్తే ఊరుకోం...**

రాజకీయాల్లో విమర్శలకు ఒక హద్దు, పద్దు ఉండాలని, బట్టకాల్చి మీద వేసే దుష్ప్రచారాలను ఎంతమాత్రం ఊరుకునేది లేదని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై కొందరు చేస్తున్న క్షుద్రపూజల ఆరోపణలపై ఆయన ఘాటుగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, వరుస స్కామ్‌లను పక్కా ఆధారాలతో తాము బయటపెడుతుండటంతో తట్టుకోలేకనే తనపై ఇలాంటి అసత్య ప్రచారాలకు తెగబడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. నాలుక ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. గతంలో తనపై అడ్డగోలు వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ ఉదంతాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ.. నాడు అడ్డగోలుగా మాట్లాడిన కొండా సురేఖ నేటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. రేపు ఈ అసత్య ఆరోపణలు చేసిన వారి విషయంలో కూడా క్రిమినల్ సూట్ మరియు డిఫమేషన్ (మానసష్ట దావా) కేసులు వేస్తాను అని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో సంబంధిత వ్యక్తులకు లీగల్ నోటీసులు ఇచ్చామని, చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హరీశ్ రావు హెచ్చరించారు.

## 'సర్'లో బీఎల్‌వోలకు
# ఎడిట్ ఆప్షన్

- **డిజిటలైజేషన్ తర్వాత తప్పుల సవరణకు వీలు**
- **ఈ నెల 10 వరకు అవకాశం**

హైదరాబాద్ ఆగస్టు 6(ప్రభాత గమనం):

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)లో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్‌లో ఏమైనా తప్పులు దొర్లితే సరి చేయడానికి బీఎల్‌వోలకు ఎన్నికల సంఘం ఎడిట్ ఆప్షన్‌ను కల్పించింది. ఈ నెల 10 వరకు ఇది పని చేస్తుంది. ఓటర్లు ఏమైనా తప్పుడు సమాచారంతో పత్రాలను అందించామని భావించినా.. బీఎల్‌వోలు పొరపాటున ఆన్‌లైన్‌లో తప్పుడు వివరాలు నమోదు చేసినా.. ఎడిట్ ఆప్షన్ ద్వారా సరిదిద్దవచ్చు. పేరులో అక్షర దోషాలు వంటివాటితో పాటు, ఎస్ఐఆర్–2002కు సంబంధించిన వివరాల్లో తప్పులు దొర్లినట్లు గుర్తిస్తే బీఎల్‌వోల వద్దకు వెళ్లి ఓటర్లు సరి చేసుకోవచ్చు. సాధారణంగా ఎన్యూమరేషన్ ఫారాల్లో తప్పులు రాస్తే.. వాటినే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆగస్టు 17 తర్వాత అలాంటి ఓటర్లకు నోటీసులు వచ్చే అవకాశం ఉంది. అప్పుడు ఎన్నికల సంఘం పేర్కొన్న గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చూపించాల్సి ఉంటుంది.

**- 'అనామలీస్ ' ఓటర్లకూ అవకాశం...**

షెడ్యూల్‌కు ముందే అధికారులు ఎస్ఐఆర్–2002తో ప్రస్తుత ఓటర్ల జాబితాను మ్యాపింగ్ చేశారు. మ్యాపింగ్ జరిగిన ఓటర్లలో సుమారు 80 లక్షల మంది అనామలీస్‌గా (వివరాల్లో కొన్ని తేడాలున్నట్లు) గుర్తించారు. అనామలీస్ జాబితాలో ఉన్న ఓటర్లు కూడా ఎడిట్ ఆప్షన్ ద్వారా సరిచేసుకునే అవకాశం ఉంది. ఎడిట్ ఆప్షన్ ద్వారా సవరణ చేసినప్పటికీ అందులో భారీ తేడాలను, అనుమానాలను అధికారులు గుర్తిస్తే మాత్రం నోటీసులు అందుతాయి. రాష్ట్రవ్యాప్తంగా 'సర్' ప్రక్రియలో భాగంగా 55 లక్షల మంది ఓటర్లను 'అన్‌కలెక్టబుల్' (చిరునామాలో లేనివారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, డూప్లికేట్ ఓటర్లు, చనిపోయినవారు)గా గుర్తించారు. అయితే బీఎల్‌వోలపై లక్ష్యం పూర్తిచేయాలని ఒత్తిడి తీసుకురావడంతో ఫారాలు పంపిణీ కాని.. ఆ చూకీ లభ్యం కాని ఓటర్లను ఈ జాబితాలో చేర్చినట్లు విమర్శలున్నాయి. తర్వాత ఆ ఓటర్లు పత్రాల కోసం బీఎల్‌వోల వద్దకు వస్తుండటంతో జరిగిన పొరపాట్లను ఎడిట్ ఆప్షన్ ద్వారా సరిచేసే వీలుంది. తప్పులు దొర్లాయని భావించి ఎవరైనా ఓటర్లు బీఎల్‌వోల వద్దకు వస్తే వారికి సహకరించాలని ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. చాలాచోట్ల ఓటర్లకు ఎడిట్ ఆప్షన్‌పై సమాచారం లేదు. కొన్నిచోట్ల తెలిసినా బీఎల్‌వోలు సహకరించడం లేదు. దీనిపై ప్రధాన రాజకీయ పార్టీల నేతలు సైతం ఎన్నికల అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు.



## రోడ్డు గుంతలు పూడ్చివేత

- **కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ప్రత్యేక చొరవ**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రధాన రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది రోడ్ల మరమ్మతు పనులు చేపట్టారు. డీజిల్ కాలనీ సెంటర్, కడిపికొండ సెంటర్, కాజీపేట సెంటర్‌లలోని ప్రధాన రహదారులపై ప్రమాదకరంగా మారిన గుంతలను రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసి)తో పూడ్చి రహదారిని చదును చేశారు. ఈ గుంతల వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలకు అవకాశం ఉండటంతో అత్యవసరంగా మరమ్మతు పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. రహదారులపై గుంతల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టామని తెలిపారు. మరమ్మతు పనుల అనంతరం ట్రాఫిక్ సాఫీగా సాగడంతో పాటు వాహనదారులకు గణనీయమైన ఊరట లభించిందని పేర్కొన్నారు.

## కేసముద్రం కేజీబీవీ నూతన భవనం
# ప్రారంభానికి సిద్ధం చేయాలి

- **విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి**
- **జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి**

కేసముద్రం ఆగస్టు 6(ప్రభాత గమనం):

15 రోజుల్లో కస్తూర్బా విద్యాలయం నూతన భవనం ప్రారంభానికి సిద్ధం చేయాలని, దాంట్లో భాగంగా అప్డేట్ ట్రాన్స్ఫార్మర్ కోసం విద్యుత్ ఏడి తో డిఇఓ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు గురువారం కేసముద్రం కేజీబీవీ నూతన భవన నిర్మాణాన్ని డిఇఓ సత్యనారాయణమూర్తి , జిఇసీఓ గాయత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాన్స్ఫార్మర్ కు సంబంధించిన డిడి రెండు రోజుల్లో అందజేస్తామని డీఈవో ఏడికి తెలిపారు. అనంతరం కస్తూర్బా విద్యాలయం (కేజీబీవీ) ని వారు తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను తరగతి గదులను, పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇన్చార్జి ఎస్ఓ, ఏఎన్ఎం కు డిఇఓ సూచించారు. అనంతరం సి ఆర్ టి లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఓ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని, ఇంగ్లీషులోనే బోధన చేయాలని, ఐఎఫ్ బి ప్యానల్స్ ఉపయోగించి బోధన చేయాలని నాణ్యమైన బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా తరగతులను నిర్వహించాలని సూచించారు.



విద్యార్థినుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇన్స్పైర్ లాంటి నామినేషన్లు పెంచాలని అన్నారు. పాఠశాల స్థాయిలో అమలవుతున్న ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలా, డిజిటల్ లెర్నింగ్ కార్యక్రమాలను విద్యార్థులచే చేయించాలని డిఇఓ సూచించారు. జిఈసిఓ గాయత్రి మాట్లాడుతూ..లిప్ లో భాగంగా బేస్ లైన్ టెస్ట్ విద్యార్థులకు నిర్వహించి, రికార్డులను ఆన్లైన్ చేయాలని, ఎఫ్ ఏ–1 విషయాలవారీగా నిర్వహించాలని, వాటి రికార్డులు మెయింటైన్ చేయాలని ఆమె సూచించారు. వార్షిక, పాఠ్య, పీరియడ్ ప్రణాళికలు రాయాలని, పాఠశాల అంతర్ పర్యవేక్షణ తరం కొనసాగించాలని ఇన్చార్జి ఎస్ ఓ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ఎస్ ఓ అర్చన, సిఆర్టి లు, పిజి సిఆర్టీలు పాల్గొన్నారు.

## ఆపదలో ప్రాణాలు కాపాడిన
# కానిస్టేబుళ్లకు నగదు పురస్కారం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

విధి నిర్వహణలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించి ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన మడికొండ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు సంపత్, గోవర్ధన్‌లను వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి, ఐపీఎస్ నగదు పురస్కారంతో సత్కరించారు. రెండు రోజుల క్రితం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట గ్రామ సమీపంలోని సాయినాథ్ వెంచర్‌లో కరీమాబాద్‌కు చెందిన మెరుగు పవన్ అనే వ్యక్తి ఆర్థిక సమస్యల కారణంగా ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఈ ఘటనను గమనించిన కానిస్టేబుళ్లు సంపత్, గోవర్ధన్ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చి బాధితుడిని రక్షించారు. అనంతరం సకాలంలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చేసి కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో వారి సేవలను గుర్తించిన వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి, ఐపీఎస్ నగదు పురస్కారం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, "ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడడం అత్యంత గొప్ప సేవ. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని గుర్తించి ప్రోత్సహిస్తాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్ఐలు రాజబాబు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.






## స్వాతంత్ర్య వేడుకలకు
# ఘనంగా ఏర్పాట్లు

- **కలెక్టర్ స్నేహ శబరిష్**

మహబూబాబాద్ ఆగస్టు 6(ప్రభాత గమనం):

ఆగస్టు 15వ తేదీన జరగబోయే భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఏర్పాట్లను ఘనంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పిడి పురుషోత్తం, జిల్లా రెవెన్యూ అధికారిని, నాగలక్ష్మి, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, సంబంధిత అన్ని విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రం, జిల్లాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో జాతీయ జెండా ను ఆవిష్కరించి ఘనంగా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ, ప్రసంగం, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల పై స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, సానిటేషన్, పిఎ సిస్టం, స్టేజ్ డెకరేషన్స్, చైర్స్, తదితర అన్ని సౌకర్యాలను సంబంధిత విభాగాల సిబ్బంది ఏర్పాట్లు చేయాలని తెలిపారు.ప్రోటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం అందించాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలపై శాఖల వారీగా సాధించిన పురోగతి పై ప్రసంగం కాపీలను సిద్దం చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, కలెక్టరేట్ పర్యవేక్షకులు పవన్ కుమార్, సూపరింటెంట్ రాజేష్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, స్థానిక తహసిల్దార్ రాజేశ్వర్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## సైబర్ క్రైం మోసాల పట్ల
# అప్రమత్తంగా ఉండాలి

- **ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్**

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సురక్ష కా తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం తాళ్ళ పద్మావతి కళాశాలలో సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. తెలంగాణ పోలీస్ డీజీపీ సి.వి. ఆనంద్, ఐపీఎస్, మహిళా భద్రత విభాగం డీజీపీ శిఖా గోయల్, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా సురక్ష కా తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేతా రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రజలను సైబర్ నేరాల పట్ల అప్రమత్తం చేయడం, ఎవరూ మోసాలకు గురికాకుండా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫైనాన్షియల్, నాన్–ఫైనాన్షియల్ ఫ్రాడ్స్, సైబర్ స్టాకింగ్, సైబర్ బులీయింగ్, డిజిటల్ అరెస్ట్, ఐడెంటిటీ థెఫ్ట్, లోన్ యాప్ మోసాలు, న్యూడ్ వీడియో కాల్స్ వంటి సైబర్ నేరాల గురించి విద్యార్థులకు వివరించారు. అపరిచిత వ్యక్తులు పంపే లింకులు, మెసేజ్‌లు, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కూడా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సుమారు 400 మంది విద్యార్థులు పాల్గొని సైబర్ భద్రతకు సంబంధించిన సూచనలు తెలుసుకున్నారు.

## నిలిచిపోయిన రహదారి పనులు
# తక్షణమే పూర్తి చేయాలి

- **గోపాలపురం క్రాస్ రోడ్ – డాక్య తండా రోడ్డును పరిశీలించిన సీపీఐ బృందం**

గార్ల,ఆగస్టు 6 (ప్రభాత గమనం):

గార్ల మండల పరిధిలోని గోపాలపురం క్రాస్ రోడ్ నుంచి డాక్య తండా వరకు నాలుగేళ్ల క్రితం ప్రారంభమై, అసంపూర్తిగా నిలిచిపోయిన బీటీ రహదారి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి ఆయన అసంపూర్తిగా ఉన్న రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించి, స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కట్టెబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ... నిధులు మంజూరై నాలుగేళ్లు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అధికారుల పర్యవేక్షణ లోపానికి పరాకాష్ట అని మండిపడ్డారు. కాంట్రాక్టర్ తీవ్ర అలసత్వం వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం శోచనీయమన్నారు.రోడ్డుపై కేవలం కంకర వేసి వదిలేయడంతో నిత్యం ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి పడిపోతున్నారని, ఎంతోమంది తీవ్ర గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన రోడ్డు లేక గ్రామస్థులు, విద్యార్థులు, రైతులు, అత్యవసర వైద్య సేవల కోసం వెళ్లే రోగులతో పాటు మూగజీవాలు కూడా రాకపోకలు సాగించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు, పాలకులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులను, ప్రజలను సమీకరించి సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్య హరినాయక్, గుగులోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374